
ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో.. పోలీసు కస్టడీకి నిందితులు

- రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో విచారించిన సిట్ అధికారులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితులను పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో ఉన్న ముగ్గురు నిందితులను రెండ్రోజుల పోలీస్ కస్టడీకి ఎసిబి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఉదయం చంచల్‌గూడ జైలుకు చేరుకున్న మొయినాబాద్ పోలీసులు నిందితులు నందకుమార్, రామచంద్రభారతి, సింహయాజి స్వామిని తమ కస్టడీలోకి తీసుకున్నారు. అటు నుంచి రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యేలకు ఎర కేసు అత్యంత సున్నితమైనది కావడం, సంచలనాత్మకంగా మారడంతో ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాల్సి ఉంటుందని, అనుభవజ్ఞులైన అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని డిజిపి మహేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సర్కారు హైదరాబాద్ పోలీసు కమిషనర్ సివి ఆనంద్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేసింది. ఆయనతో పాటు నేరాల దర్యాప్తులో అపార అనుభవం, నూతన సాంకేతికతను ఉపయోగించుకోవడంలో నైపుణ్యం ఉన్న ఉన్నతాధికారులను ఈ బృందంలో సభ్యులుగా నియమించింది. నల్లగొండ ఎస్‌పి రెమా రాజేశ్వరి, సైబరాబాద్ డిసిపి కల్మేశ్వర్ సింగన్వర్, శంషాబాద్ డిసిపి జగదీశ్వర్‌రెడ్డి, నారాయణపేట ఎస్‌పి వెంకటేశ్వర్లు, రాజేంద్రనగర్ ఎసిపి గంగాధర్, మొయినాబాద్ ఎస్‌హెచ్‌ఒ లక్ష్మీరెడ్డి ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ముగ్గురు నిందితులను వేరువేరు గదుల్లో ఒక్కొక్కరిని సిట్ అధికారులు విచారించారు. నకిలీ పాన్ కార్డు, ఆధార్ కార్డు ఎలా వచ్చాయని అధికారులు ఆరా తీస్తున్నారు. అదేవిధంగా ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో వెనుక ఉన్నవారి గురించి విచారిస్తున్నారు. శుక్రవారమూ విచారణ కొనసాగుతుందని పోలీసులు స్పష్టం చేశారు. విచారణ సందర్భంగా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిట్‌ను వ్యతిరేకిస్తున్నారంటే దొంగలన్నట్టే కదా : తమ్మినేని

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారానికి సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే బిజెపి నేతలు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. ఆ వ్యవహారంతో సంబంధం లేకుంటే సిట్‌ను ఏర్పాటు చేసిన 24 గంటల్లోనే వారు హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారంలో సింహయాజీ, రామచంద్ర భారతి, నందకుమార్‌ను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిని పోలీసులు తమ కస్టడీలోకి తీసుకునేందుకు నాంపల్లిలోని ఎసిబి కోర్టు అనుమతిచ్చింది. నిందితుల తరపు న్యాయవాది సమక్షంలోనే సిట్ విచారణ చేపట్టనుంది. అయితే ఈ విచారణను సవాల్ చేస్తూ బీజేపీ నేత ప్రేమేందర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారని తమ్మినేని తెలిపారు. దీన్ని వద్దంటున్నారంటే బిజెపి నేతలు దొంగలన్నట్టే కదా?అని ఆయన విమర్శించారు. ఇది గుమ్మడి కాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్నట్టుగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు సంబంధించి బిజెపికి ఎలాంటి సంబంధం లేదంటూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ యాదాద్రి వద్ద తడిబట్టలతో ప్రమాణం చేశారని గుర్తు చేశారు. అలాంటప్పుడు సిట్‌ను ఎందుకు వద్దనుకుంటున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎస్ఎల్ సర్టిఫైడ్ వీడియో ఫూటేజీ ఉందనీ,, దాన్ని అన్ని సంస్థలకూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని గుర్తు చేశారు. వారి బాగోతం బయటపడుతుందనే సిట్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టును ఆశ్రయించారని విమర్శించారు. ఇంకోవైపు ఈ వ్యవహారంపై సిబిఐతో విచారణ చేయించాలంటున్నారని తెలిపారు. ఇది వారి ద్వంద్వ స్వభావానికి నిదర్శనమని తెలిపారు. కావాలనే తమను ఇరుకిస్తుందనే దానిపై ఇంతకుముందు సుప్రీం కోర్టులోనూ పిటిషన్ వేశారని గుర్తు చేశారు. దొంగలెవరో తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సిట్ ద్వారా విచారణ చేపడుతున్నదని పేర్కొన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రాష్ట్రాన్ని వశం చేసుకోవాలని బిజెపి భావిస్తోందని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను ఇడి, సిబిఐ,ఐటి దాడులతో బెదిరిస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యేలను లొంగదీసుకోవాలని చూస్తున్నదని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.



సోమ భరత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రులు

విజయ డెయిరీ అభివృద్ధికి కృషి

డెయిరీ నూతన ఛైర్మన్ సోమ భరత్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం కెసిఆర్, పాడి రైతుల, ఉద్యోగుల సహకారాన్ని తీసుకొని రానున్న రోజుల్లో విజయ డెయిరీ ఉన్నతికి పాటుపడుతానని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సమాఖ్య లిమిటెడ్ (టిఎస్‌డిడిసిఎఫ్) నూతన ఛైర్మెన్ సోమ భరత్ కుమార్ అన్నారు. హైదరాబాద్ లాలాపెట్‌లోని విజయ డెయిరీ ఆవరణలో గురువారం నూతన ఛైర్మెన్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన ఛైర్మెన్‌కు వారు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పుష్కలంగా తాగునీరు ఉండటంతో పశుగ్రాసానికి కొరత లేదని, దీంతోపాటు పశువులు ఆరోగ్యకరంగా పెరిగే వాతావరణం ఉందన్నారు. కావాల్సిన పాలు మనమే ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు సన్నాహాలు చేస్తామన్నారు. సిఎం సహకారం, ఉద్యోగుల, రైతుల సహకారంతో ముందుకు వెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు లింగయ్య యాదవ్, బండ ప్రకష్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, శోభన్ రెడ్డి, కమిషనర్ ఆధార సింహ, అధికారులు జియం కమేష్, మల్లికార్జున్, మల్లయ్య, అరుణ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

- హాట్సన్ పరిశ్రమలో చాక్లెట్ విభాగాన్ని ప్రారంభించిన మంత్రి తలసాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పరిశ్రమలను తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్ గ్రామంలో గురువారం హాట్సన్ పరిశ్రమ నూతనంగా ఏర్పాటుచేసిన చాక్లెట్ తయారీ విభాగాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పాడి పరిశ్రమల అనుబంధ పరిశ్రమలకు నాలుగు శాతం నుంచి 50 శాతం వరకు సబ్సిడీ కల్పిస్తున్నారన్నారు. మేడ్చల్ జీడిమెట్లలో రూ.20 కోట్లతో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రూ.400 కోట్లతో జహీరాబాద్‌లో హాట్సన్ పరిశ్రమను స్థాపించి భారతదేశంలోనే అతి ఎక్కువ ఉత్పత్తిని సాధించే పరిశ్రమగా పేరుగాంచడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. 1970లో ప్రారంభమైన హాట్సన్ పరిశ్రమ దినదినాభివృద్ధి చెంది దేశ, విదేశాల్లో తెలంగాణ ఉత్పత్తులను విక్రయించే స్థాయికి ఎదగడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. హాట్సన్ పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక రైతులకు ఉపాధితో పాటు అన్ని రకాల సౌకర్యాలు లభిస్తాయన్నారు. ఇక్కడి రైతుల పాలను సేకరించి మెరుగైన మద్దతు ధర ఇవ్వాలని మంత్రి సూచించారు. పరిశ్రమల స్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టాలను చేయడంతో తెలంగాణలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సౌత్ ఏషియాలోనే పాల ఉత్పత్తి పెద్ద పరిశ్రమ జహీరాబాద్‌లో ఏర్పాటు కావడం శుభసూచకమన్నారు. పరిశ్రమల శాఖ చీఫ్ సెక్రటరీ జెఎస్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం 14 రకాల సబ్సిడీలను అందిస్తోందన్నారు. ఆహార ఉత్పత్తి పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్, నీటి, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో డెయిరీ, చేపల ఉత్పత్తి, నూనెల తయారీ, పండ్ల పరిశ్రమలు లాంటి 30 పరిశ్రమలు ఏడేళ్లలో రాష్ట్రంలో ఏర్పాటయ్యాయన్నారు. ఎండి సత్య చంద్రమోహన్ మాట్లాడుతూ.. 97 వేల కిలోల చాక్లెట్ల ఉత్పత్తి ఒక్కరోజులోనే తయారు చేసే పరిశ్రమను జహీరాబాద్‌లో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ పరిశ్రమతో జహీరాబాద్ ప్రాంత ప్రజలకు ఉపాధి కలుగుతుందన్నారు. పరిశ్రమ ప్రారంభోత్సవం అనంతరం పరిశ్రమల్లో ఉత్పత్తులను మంత్రి శ్రీనివాస్ యాదవ్ తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపి బిబి పాటిల్, ఎమ్మెల్యే మాణిక్యరావు, డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, ఆసీస్ గౌరవ్, ప్రసన్నకుమార్, ప్రభంజన్, ఆత్మ కమిటీ ఛైర్మెన్ పెంటారెడ్డి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ తన్వీర్, విజయకుమార్, ఆర్టిఒ రమేష్ బాబు, ఎస్‌పి, డిఎస్‌పి తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రమాణం

- పలువురు మంత్రులు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుగోడు ఎమ్మెల్యేగా కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రమాణం స్వీకారం చేశారు. హైదరాబాద్ శాసనసభలోని తన చాంబర్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ప్రభాకర్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, మహమూద్ అలీ, జగదీష్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్‌తోపాటు, పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మెన్లు, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు, అసెంబ్లీ కార్యదర్శి వి నరసింహాచార్యులు పాల్గొన్నారు. అనంతరం కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి అసెంబ్లీ రూల్స్ బుక్స్, ఐడెంటిటీ కార్డును స్పీకర్ అందజేశారు. విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. ఈ నెల మూడున ఉపఎన్నికలో కూసుకుంట్ల తాజా మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని ఓడించారు. ఆయనపై పది వేలకుపైగా ఓట్ల తేడాతో విజయం సాధించారు. ప్రమాణస్వీకారం అనంతరం ఆయన శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుత్తా మాట్లాడుతూ కూసుకుంట్ల ఎమ్మెల్యేగా గెలుపొందడం పట్ల అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర నివాసంలో ఇడి సోదాలు

పలు కీలక పత్రాలు స్వాధీనం

ప్రజాశక్తి - మైదరాబాద్ బ్యూరో

గ్రానైట్ కంపెనీ యజమానుల ఇళ్లు, కార్యాలయాలపై గురువారమూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాడులు కొనసాగాయి. మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు పలువురు గ్రానైట్ కంపెనీల యజమాన్లు ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఇడి....టిఆర్ఎస్ ఎంపి రవిచంద్ర నివాసంలో గురువారం తనిఖీలు చేసింది. హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలోని ఆయన ఇంట్లో రాత్రి వరకు కొనసాగాయి.గ్రానైట్ కంపెనీలపై ఇడి అధికారులు జరిపిన దాడుల్లో పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. పలు కీలక డాక్యుమెంట్లు, ల్యాప్ టాప్‌లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. వీటన్నింటినీ హైదరాబాద్‌లోని ఇడి కార్యాలయానికి తరలించారు. వాటిని విశ్లేషించిన తర్వాత ఇడి అధికారులు సంబంధిత గ్రానైట్ కంపెనీల యజమానులకు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచే అవకాశముంది. హవాలా, మనీలాండరింగ్, నిబంధనలకు విరుద్ధంగా ఎగుమతులు చేసినట్టు ఇడి అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు పూర్తి ఆధారాలు సేకరించిన తర్వాత సదరు గ్రానైట్ కంపెనీల యజమానులను బాధ్యులు చేసే అవకాశముంది.

ఆర్‌టిసి కార్మికుల సమస్యల్ని పరిష్కరించండి

ఆ సంస్థ ఛైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు సిఐటియు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్టీసి కార్మికుల పే స్కేల్, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు వారు టిఎస్‌ఆర్‌టిసి ఛైర్మెన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు లేఖ రాశారు. 2019 జులై నుంచి కార్మికులకు బకాయిపడ్డ ఏడు డిఎలలో ఐదింటిని అమలు చేయడం, సమ్మెకాలపు జీతాన్ని చెల్లిస్తూ ఉత్తర్వులివ్వడం, పండుగ అలవెన్సులు ఇప్పించడం లాంటివి మంచి పరిణామాలని పేర్కొన్నారు. అయితే, బకాయిపడ్డ 2017, 2021 వేతన ఒప్పందాలను వెంటనే అమలు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ భద్రతపై 2021లో విడుదల చేసిన మార్గదర్శకాలలో మార్పులు చేయాలని సూచించారు. సంస్థలో యూనియన్ల కార్యకలాపాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అనుసరిస్తున్న తీరుతో సిసిఎస్ తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నదని వాపోయారు.

విమానాల పరిశోధన

- నవంబర్ 1 నుంచి ఏప్రిల్ 30 వరకు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇస్రో, అటామిక్ ఎనర్జీ శాఖ సంయుక్తాధ్వర్యంలో ఏప్రిల్ 30 వరకు పది బెలూన్ విమానాలను పరిశోధన కోసం వినియోగించనున్నట్టు టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ సైంటిస్ట్ ఇన్‌చార్జ్ బి సునీల్ కుమార్ తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల ఒకటిన ప్రారంభమైందని తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చ్ (ఇసిఐఎల్) నుంచి బెలూన్లలో హైడ్రోజన్ గ్యాస్, శాస్త్రీయ పరికరాలను నింపి పరిశోధన చేయనున్నట్టు తెలిపారు. ప్లాస్టిక్ ఫిలింలు 50 మీటర్ల నుంచి 85 మీటర్ల వరకు ఉంటాయనీ, సాధారణంగా రాత్రి ఎనిమిది గంటల నుంచి ఉదయం 6.30 గంటల మధ్య వీటిని ప్రారంభించనున్నట్టు తెలిపారు. పరిశోధన ఆధారంగా వీటిని 30 కిలోమీటర్లు, 42 కిలోమీటర్ల ఎత్తుకు ఎగురవేయనున్నట్టు తెలిపారు. ప్రజలు పారాచూట్‌లను చూస్తే వాటి నుంచి పరికరాలను తొలగించవద్దని కోరారు. అలాంటి సందర్భాల్లో సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ... నల్ల బెలూన్లతో నిరసన


- గిరిజన సంఘాల జెఎసి పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 'నల్లబెలూన్ల'తో నిరసన తెలపాలని గిరిజన సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. తక్షణం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనీ, అటవీ సంరక్షణ నియమాలు-2022 బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దేశంలో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం పది శాతానికి రిజర్వేషన్ పెంచాలనీ, బయ్యారం ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలంటూ కేంద్రాన్ని కోరింది. గిరిజన సంఘాల జెఎసి ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెఎసి నేతలు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, టిఆర్ఎస్ గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి రాజలింగం నాయక్, లంబాడీస్ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సురేష్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు కె సోమ్లా నాయక్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం బాలు నాయక్, నాయకులు ఆర్ శేఖర్ నాయక్, ఆర్.పాండు నాయక్, గోరియా నాయక్, సురేష్ తదితరులు మాట్లాడుతూ తెలంగాణ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు చేయాలనీ, గిరిజన వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలో భాగంగా తెలంగాణలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు యూనివర్సిటీని ఏర్పాటు చేయలేదని విమర్శించారు.

సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న గవర్నర్

- రాజ్యాంగ పరిధిదాటి వ్యవహరించడం సరికాదు
- సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. రాజ్‌భవన్‌లో ప్రజాదర్బార్‌ను నిర్వహించి ఎవరైనా రావొచ్చు, సమస్యలపై వినతిపత్రాలు ఇవొచ్చనడం సరైంది కాదని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే సమస్యలను పరిష్కరిస్తుందని వివరించారు. సిఎం, మంత్రులకు అధికారాలుంటాయని పేర్కొన్నారు. గవర్నర్ రాజ్యాంగ పరిధి దాటి వ్యవహరించడం సమంజసం కాదని తెలిపారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను ఆపే అధికారం గవర్నర్‌కు లేదని విమర్శించారు. కానీ ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టి ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంకోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై ప్రెస్‌మీట్ నిర్వహించి విమర్శలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. గవర్నర్ కేంద్రానికి రబ్బర్‌స్టాంప్‌లా, బిజెపి నాయకురాలిగా వ్యవహరిస్తున్నారని పేర్నొన్నారు. రాజ్యాంగ పరిధిలో చట్టప్రకారం గవర్నర్ గౌరవంగా వ్యవహరించాలనీ, అగౌరవంగా వ్యవహరించడం సరైంది కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించకుండా కేంద్రం చెప్పినట్టు, బిజెపి నాయకుల్లా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సూచించారు. ఇలాంటి వ్యవహారశైలిని మార్చుకోవాలని కోరారు. ఈ రకంగా అవలంభిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయబోవని తెలిపారు. బిల్లులను తొక్కిపెట్టడం సరైంది కాదని పేర్కొన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా బిల్లులుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే అధికారం గవర్నర్‌కు ఉందనీ, ఆపే అధికారం లేదని వివరించారు. తీరు మారకపోతే ప్రజలే గవర్నర్ పాత్రకు వ్యతిరేకంగా ఉద్యమించడంతోపాటు రాజ్‌భవన్‌ను ముట్టడించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రజలకు వ్యతిరేకంగా బిల్లులను తయారు చేస్తే ఆయా ప్రభుత్వాలకు వారే బుద్ధి చెప్తారని తెలిపారు.

'నిజాం' విద్యార్థుల చర్చలు విఫలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాం కళాశాల హాస్టల్ విషయంలో విద్యార్థులకు, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్‌తో గురువారం రెండు విడతలుగా జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దాంతో విద్యార్థులు శుక్రవారం నుంచి తిరిగి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కళాశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర మంత్రి కెటిఆర్ కళాశాల జూబ్లీ వేడుకల్లో పాల్గొని విద్యార్థినుల కోసం హాస్టల్ నిర్మిస్తామని ఇచ్చిన హామీ మేరకు కళాశాల ప్రాంగణంలో నూతనంగా హాస్టల్ భవనం నిర్మించింది. ఆ హాస్టల్‌లో పీజీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ఆదేశాలు జారీ చేశారు. దాంతో వారం రోజులుగా డిగ్రీ విద్యార్థులు తమకే హాస్టల్ వసతి సౌకర్యం కల్పించాలని కళాశాలలో ఆందోళనలు చేస్తున్నారు. ఈ విషయం మంత్రి కెటిఆర్ దృష్టికి వెళ్లడంతో ఆయన విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి సమస్యను పరిష్కరించాలని సూచించారు. గురువారం రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో పది మంది విద్యార్థినులు గంటపాటు చర్చలు జరిపారు. ఈ చర్చల్లో హాస్టల్‌లో 50 శాతం పీజీ, 50 శాతం డిగ్రీ విద్యార్థినులకు ప్రవేశం కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. దాంతో విద్యార్థులు తాము మిగిలిన విద్యార్థులతో చర్చించి తిరిగి చర్చలకు వస్తామని ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటలకు మళ్లీ చర్చలు జరగగా నలుగురు విద్యార్థులే హాజరయ్యారు. హాస్టల్ మొత్తం డిగ్రీ విద్యార్థులకు కేటాయించాలనడంతో, మిట్టల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఉద్యమాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఒకరి హత్య

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో పోలీస్ ఇన్‌ఫార్మర్ పేరుతో సూరవీడు పంచాయతీ కొండాపురం గ్రామ సమీపంలోని బస్తరుగుంపునకు చెందిన ఒకరిని మావోయిస్టులు హత్య చేశారు. సబక గోపాల్ (55)ను బుధవారం రాత్రి గొడ్డళ్లతో నరికి, కత్తులతో పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆల్‌కార్గోకు రూ.230 కోట్ల లాభాలు

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో ఆల్ కార్గో లాజిస్టిక్స్ నికర లాభాలు 13 శాతం తగ్గి రూ.230 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.263 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం రూ.4,978 కోట్లుగా ఉండగా.. గడిచిన క్యూ2లో 6.5 శాతం పెరిగి రూ.5,300 కోట్లకు పెరిగినట్లు ఆ కంపెనీ తెలిపింది.

హైదరాబాద్‌లో ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ కేంద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్

అమెరికాకు చెందిన ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ ఇంక్ హైదరాబాద్‌లో తన నూతన కేంద్రాని ప్రారంభించింది. ఇంటిగ్రేషన్, లెగసీ ఆధునీకరణ, క్లౌడ్ సేవల్లో ప్రత్యేకతలు కలిగిన ఈ సంస్థ గురువారం నగరంలో తన ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్ (ఐడిసి)ను హైసియా ప్రెసిడెంట్ అండ్ డెలివరీ హెడ్ ఇన్ఫోసిస్ మనీషా సబూ ప్రారంభించారు. "దేశంలోనే వ్యాపారం, టెక్నాలజీలకు ప్రధాన కేంద్రాల్లో ఒకటైన హైదరాబాద్‌లో తన కొత్త డెవలప్ మెంట్, సర్వీసెస్ సెంటర్ ప్రారంభంతో ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ ఇంక్ సంస్థ దేశంలో తన రెండో కంపెనీని విస్తరించింది. ఈ సంస్థ ఆగ్నేయాసియా, భారతీయ సంస్థలకు సరికొత్త టెక్నాలజీలను గుర్తించడం, అమలు చేయడం, నిర్వహించడంలో సహాయపడుతుంది. అదే సమయంలో మెరుగైన ఉత్పత్తులు, సేవలను సష్టించడం, ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడంలో ఐటీ కంపెనీలకు సహాయపడుతుంది." ఇన్ఫోవ్యూ సిస్టమ్స్ సిటిఒ సత్య శేఖర్ దాస్ మండల్ పేర్కొన్నారు.



పార్టీకి పూర్వవైభవం తేవాలి : చంద్రబాబు

తెలంగాణ టిడిపి అధ్యక్షుడిగా కాసాని బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగుజాతి అభివృద్ధి కోసం ఎన్‌టిఆర్ రాజకీయాల్లోకి వచ్చారనీ, తెలంగాణ గడ్డపై తెలుగుదేశం పుట్టిందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు ఎన్ చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఎన్‌టిఆర్ భవన్‌లో ప్రమాణ స్వీకారోత్సవంలో చంద్రబాబు మాట్లాడారు. టిడిపికి పూర్వవైభవం తెచ్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలుగుదేశం ఉంటుందని వ్యాఖ్యానించారు. అతి తక్కువ సమయంలో అధికారంలోకి వచ్చిన పార్టీ టిడిపి అని గుర్తు చేశారు. ఆర్థిక అసమానతలు పోయేవరకు టిడిపి పనిచేస్తూనే ఉంటుందని అభిప్రాయపడ్డారు. పాలనను పేదవాడి ఇంటిముందుకు తెచ్చి, రాజకీయాలకు కొత్త అర్థం ఇచ్చిన నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించామని చెప్పారు. తెలంగాణలో ఇరిగేషన్ అభివృద్ధికి, హైదరాబాద్‌లో ఐటి అభివృద్ధికి నాంది పలికిందని వివరించారు. కాసాని జానేశ్వర్ మాట్లాడుతూ హైదరాబాద్ నడిబొడ్డులో టిడిపి పుట్టిందన్న విషయం మర్చిపోవద్దన్నారు. 'చంద్రబాబు అంటే క్షమశిక్షణ... క్రమశిక్షణ అంటే చంద్రబాబు' అని అన్నారు. దివంగత సీనియర్ ఎన్‌టిఆర్ పిలుపుతో అన్ని జిల్లాల యువత టిడిపి జెండా పట్టుకున్నారని, రాష్ట్రంలో టడిపికి పూర్వవైభవం తెచ్చేందుకు గ్రామ గ్రామాన తిరుగుతానన్నారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు చేసిన అభివృద్ధి పనులే మనకు ఎజెండా అని, చంద్రబాబు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు. సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలుగుదేశం ఉంటుందని చెప్పారు. రెండు రాష్ట్రాల నుంచి కార్యకర్తలు తరలివచ్చారు. పార్టీకి పూర్వవైభవం రావడానికి కృషిచేస్తానన్నారు. మన నాయకుడు చేసిన అభివృద్ధి పనులు చెబుతూ ముందుకు సాగుతామని వ్యాఖ్యానించారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలు టిడిపికి అండగా ఉన్నారని' అని కాసాని అన్నారు. ప్రమాణ స్వీకారానికి ముందు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ర్యాలీగా పెద్దసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనంతరం ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద ఎన్‌టిఆర్‌కు నివాళులు అర్పించి, టిడిపి కార్యాలయానికి అక్కడ నుంచి భారీ ర్యాలీతో చంద్రబాబు ఇంటికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, అర్వింద్‌కుమార్‌గౌడ్, బక్కని నిర్సంహులు, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, రామేశ్వర్, తెలుగు మహిళ అధ్యక్షురాలు జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

క్షౌరవృత్తిలోకి రిలయన్స్ సంస్థలను నిషేధించాలి

అంబానీ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

క్షౌరవృత్తిలోకి రిలయన్స్ సంస్థను నిషేధించాలని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకులు పి ఆశయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ క్షౌరవృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లాలోని అంబేద్కర్ క్రాస్ రోడ్స్ వద్ద గురువారం రిలయన్స్ అధిపతి అంబానీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడా కార్పొరేట్ సంస్థలు క్షౌరవృత్తిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నాయని, దాంతో లక్షలాదిమంది సంప్రదాయ వృత్తిదారుల ఉపాధి దెబ్బతిని వీధిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కరోనా విపత్కర పరిస్థితుల్లో ఈ వృత్తి తీవ్ర ఇబ్బందులకు గురవడంతో వేలాదిమంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని తెలిపారు. సంఘం జిల్లా కన్వీనర్ జంపాల రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు లక్షల కుటుంబాలు క్షౌరవృత్తిపై ఆధారపడి 70 వేల సెలూన్ షాపులు ఉన్నాయన్నారు. బడా కార్పొరేట్ సంస్థలు ఈ వృత్తిలోకి వస్తే వారంతా ఉపాధి కోల్పోయి ఆకలి చావులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. క్షౌరవృత్తిని కాపాడి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య, గొడుగు వెంకట్, కంచర్ల కుమార్, భాను, రమేష్, బాబు, మూర్తి, ఎన్టీఆర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల గుడిసెలు తొలగింపు

భారీగా పోలీసు బలగాలు, రెవెన్యూ యంత్రాంగం - సిపిఎం నాయకుల అరెస్టు
నిరసనగా కందుకూర్ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా
పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ, జ్యోతి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా కందుకూర్ రెవెన్యూ కొత్తగూడ గ్రామపంచాయతీలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించాలని 2007లో సిపిఎం చేసిన పోరాటాల ఫలితంగా అప్పటి ప్రభుత్వం సర్వే నెంబర్ 788లో 188 మందికి 60 గజాల చొప్పున సర్టిఫికెట్లు అందజేశారు. 16 ఏళ్లు గడుస్తున్నా వారికి ఇప్పటికి స్థలాలు కేటాయించకపోవడంతో ఎన్నో ధర్నాలు, వినతులు ఇచ్చినా ప్రభుత్వాలు స్పందించలేదు. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన 188 కుటుంబాలు 16 రోజులుగా ఆ భూమిలో గుడిసెలు వేసుకొని రాత్రింబవళ్లు అక్కడే ఉండి పనులు చేసుకుంటున్నారు. కాగా, గురువారం పోలీసు యంత్రాంగం, రెవెన్యూ సిబ్బంది వచ్చి అక్కడి నుంచి ఖాళీ చేయాలని వారిపై ఒత్తిడి తెచ్చారు. గుడిసెలు కూల్చివేసేందుకు ప్రయత్నించారు. దాంతో వాగ్వివాదం జరిగింది. ఘటన విషయం తెలుసుకొని వారికి మద్దతు తెలిపేందుకు వచ్చిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుబ్బాక రామ్‌చందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య, మండల కార్యదర్శి బి శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు అంకగాళ్ల కుమార్, రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, మంచాల మండల కార్యదర్శి శ్యాంసుందర్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ జంగయ్య, మండల కమిటీ సభ్యులు బుట్టి బాలరాజ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, ఆర్. శేఖర్‌ను అరెస్ట్ చేసి యాచారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


ధర్నాలో మాట్లాడుతున్న జాన్ వెస్లీ, జ్యోతి

విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జ్యోతి అక్కడి చేరుకుని నిర్వాసితులతో కందుకూర్ ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. అరెస్టు చేసిన నాయకులను విడిచి పెట్టేవరకూ ఇక్కడినుంచి కదిలేదిలేదని నాలుగు గంటల పాటు అక్కడే కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2007లో సిపిఎం పోరాట పలితంగా అప్పటి ప్రభుత్వం ఇళు లేని నిరుపేదలకు 60 గజాల చొప్పున, సర్టిఫికెట్లు అందజేసి ఇప్పటికి స్థలాలు కేటాయించలేదేని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి అయిన సబితాఇంద్రారెడ్డి పేదల పట్ల సానుకూలత వ్యక్తం చేయకుండా, సమస్యను పరిష్కరించకుండా, తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురువుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇళ్ల స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. పోలీసులు అరెస్టు చేసిన సిపిఎం నాయకులు విడుదల అనంతరం కందుకూరు ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు మధుసూదన్ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సామెల్, ఇ నరసింహ, అల్లంపల్లి నరసింహ, నాయకులు గాదె కుమార్, సత్తయ్య, గుడిసెల నిర్వాసితులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయం కాంగ్రెస్‌దే...

రామగుండంపై పొన్నం ప్రభాకర్.. ప్రధాని మోడీకి లేఖ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించాలనే నిర్ణయాన్ని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ తీసుకున్నారని మాజీ ఎంపి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ఆనాడు యుపిఎ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఆ కంపెనీకి రూ. పది వేల కోట్లు కేటాయించారని తెలిపారు. మిగతా ఐదు ఎరువుల కర్మాగారాలకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోడీకి ఆయన బహిరంగ లేఖ రాశారు. 1980లో దేశీయ అవసరాల నిమిత్తం 750 టన్నుల సామర్థ్యంతో మొదలు పెట్టి, అప్పటికే అందుబాటులో ఉన్న ఎన్‌టీపీసీ ద్వారా కరెంట్ ఉత్పత్తిని ప్రారంభించాలని తెలిపారు. కొంతమేర నష్టం వాటిల్లినప్పటికి దేశీయ ఉత్పత్తి ఉండాలనే సంకల్పంతోనే నష్టాల బారిన నడుస్తున్న ఆ సంస్థను 20 ఏళ్లు కాపాడారని గుర్తు చేశారు. 1999లో బిజెపి ప్రభుత్వ హయాంలోనే ఆ సంస్థను చూసేశారని తెలిపారు. 1999–2004 వరకు ఉన్న బిజెపి ప్రభుత్వం హయాంలో ఆ కంపెనీని ప్రారంభించేందుకు, కొనసాగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అనంతరం తమ ప్రభుత్వం దాన్ని విద్యుత్ ద్వారా కాకుండా గ్యాస్ అధారిత ప్రాజెక్టుగా మార్చి సామర్థ్యం పెంచేందుకు సాంకేతిక, ఆర్థిక నిపుణులతో కమిటీ వేసిందని పేర్కొన్నారు. సర్వేలు నిర్వహించి, దానికి వ్యయ అంచనాలు తయారు చేసిందని మోడీకి గుర్తు చేశారు. 2013లో రూ. 5600 కోట్ల పెట్టుబడితో రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పున:ప్రారంభించేందుకు క్యాబినెట్ తీర్మానం చేసిందని వివరించారు.


సమరయోధులతో గవర్నర్ తమిళిసై

బైరాన్‌పల్లి సమరయోధుల చరిత్ర గొప్పది

పాఠ్యపుస్తకాల్లో చేర్పించేందుకు కృషి
తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

వీరోచితంగా పోరాడి నిజాం రజాకార్ల చెర నుంచి గ్రామాన్ని రక్షించుకున్న బైరాన్‌పల్లి అమరవీరుల చరిత్ర గొప్పదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామంలోని అమరవీరుల స్తూపం, బురుజు వద్ద అమరవీరులకు గవర్నర్ నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నిజాం రజాకార్లతో వీరోచితంగా పోరాడి అమరులైన వారికి నివాళులర్పించేందుకు వచ్చినందుకు తనజన్మ ధన్యమైందన్నారు. సర్పంచ్ బండి శ్రీనివాస్‌గౌడ్ సూచన మేరకు గ్రామంలో ప్రతి సమరయోధుడి కుటుంబానికి పెన్షన్ మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బైరాన్‌పల్లి చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్పించేందుకు, పర్యాటక కేంద్రంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. బైరాన్‌పల్లి గ్రామానికి రావడానికి కారణమైన చల్లా అఖిలను గవర్నర్ అభినందించారు. అనంతరం నిజాం రజాకార్లతో వీరోచితంగా పోరాడిన సమరయోధులను ఆమె శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మద్దూరు జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ నందనమైన నర్సింలు, గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బల్దియాలో ఉపసంహరించుకునేదెవరు?

స్టాండింగ్ కమిటీకి 19 మంది నామినేషన్లు
నేడు పరిశీలన.. 19న పోలింగ్, ఫలితాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిపాలనలో కీలకమైన స్టాండింగ్ కమిటీ ఎన్నికలు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల రెండు నుంచి పది వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. ఈ మేరకు స్టాండింగ్ కమిటీలోని 15 మంది సభ్యులకుగాను 19 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్లను శుక్రవారం పరిశీలించనున్నారు. అనంతరం అర్హత సాధించిన నామినేషన్లను అధికారులు ప్రకటిస్తారు. అయితే నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి ఈ నెల 14వ తేదీ వరకు గడువు ఉంది. అదే రోజు పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. 19వ తేదీ ఉదయం పది గంటల నుంచి మూడు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

ఒప్పందం ప్రకారమే

జిహెచ్ఎంసిలో ఒప్పందం ప్రకారమే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టిఆర్ఎస్, మజ్లీస్‌పార్టీ నామినేషన్లు వేశారు. అయితే 15మంది సభ్యులకుగాను 19 మంది నామినేషన్ వేశారు. 15 మంది సభ్యుల్లో ఎనిమిదిమంది టిఆర్ఎస్, ఏడుగురు మజ్లీస్‌పార్టీ నుంచి ఉండే అవకాశముంది. ఆ నలుగురు నామినేషన్లను ఉపసంహరించుకుంటే 15 మంది సభ్యులు ఏకగ్రీవంగానే ఎన్నికయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.


నామినేషన్లు దాఖలు చేస్తున్న దృశ్యం

నామినేషన్ల వేసినవారు ఇలా..

జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్లు వేసిన వారు.. ఆర్ సునీత, రాగం నాగేందర్‌యాదవ్, బానోత్ సుజాత, పొడవు అర్చన, ఉప్పలపాటి శ్రీకాంత్, అబ్దుల్ వహీద్, సయ్యద్ సొహైల్ ఖాద్రీ, మహ్మద్ రషీద్‌ఫరాజుద్దీన్, మహ్మద్ అబ్దుల్ ముక్తదర్, సయ్యద్ మినాజుద్దీన్, సామీనాబేగం, ఇఎస్ రాజ్ జితేంద్రనాథ్, బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్, టి మహేశ్వరి, బండారి రాజ్‌కుమార్, వనం సంగీతయాదవ్, శాంతిసాయిజెన్ శేఖర్, మహ్మద్ మాజిద్‌హుస్సేన్, సతీష్‌బాబు పండాల ఉన్నారు. బరిలో ఎవరెవరు ఉంటారో? 14వ తేదీ వరకు వేచిచూడాల్సిందే.

దేశంలోనే తెలంగాణ పోలీసులు నంబర్ వన్

- హోంమంత్రి మహమ్మద్ అలీ
- పోలీస్ బెటాలియన్‌లో కన్వెన్షన్ సెంటర్ ప్రారంభించిన హోంమంత్రి, డిజిపి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

దేశంలోనే తెలంగాణ పోలీసులు నంబర్ వన్‌గా ఉన్నారని హోంమంత్రి మహమ్మద్ అలీ అన్నారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలో గల ఫస్ట్ పోలీస్ బెటాలియన్‌లో రూ.12 కోట్లతో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన కన్వెన్షన్ సెంటర్‌ను హోంమంత్రి, డిజిపి మహేందర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. మార్చి 2020లో ఈ అధునాతన కన్వెన్షన్ సెంటర్‌కు తెలంగాణ ప్రభుత్వం పునాదులు వేసిందని, కోవిడ్ సమయం అయినప్పటికీ పని ఆపకుండా పూర్తి చేసిన, సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సిఎం కెసిఆర్ పోలీసు వ్యవస్థపై ఎంతో ఖర్చు చేస్తున్నారని, కావలసిన అన్ని నిధులు సమకూరుస్తున్నందున, దేశంలోనే తెలంగాణ పోలీసులకు నంబర్ వన్ స్థానం దక్కిందన్నారు. కన్వెన్షన్ సెంటర్లపై, పోలీసు పెట్రోల్ పంపులపై వచ్చిన ఆదాయానికి ఇన్‌కం ట్యాక్స్ లేకుండా అనుమతి ఇచ్చారని, అదేవిధంగా కన్వెన్షన్ సెంటర్‌కు ఆర్థిక సహాయం చేసిన దాతలకూ ట్యాక్స్ రద్దు చేశారని తెలిపారు. డిజిపి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొట్టమొదటి కన్వెన్షన్ సెంటర్ సిద్దిపేటలో ప్రారంభించామన్నారు. రెండో కన్వెన్షన్ సెంటర్‌ను ఎంతో విశాలవంతంగా, అధునాతన సౌకర్యాలతో యూసఫ్‌గూడలోని ఫస్ట్ బెటాలియన్‌లో ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సిఎం కెసిఆర్ ప్రతి జిల్లాలో పోలీసుల కుటుంబాల కోసం ఇదే విధంగా కన్వెన్షన్ సెంటర్లను ప్రారంభించేందుకు, పోలీస్ పెట్రోల్ బంకులు నిర్మించుకునేందుకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ కన్వెన్షన్ సెంటర్లు పోలీసు కుటుంబాల కోసమే కాకుండా, బయటి వారికి కూడా అద్దెకి ఇచ్చి వచ్చిన ఆదాయాన్ని పోలీసు వ్యవస్థకు వాడుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. పోలీస్ హౌసింగ్ స్కీమ్ ద్వారా ప్రతి పోలీస్ కుటుంబానికి సొంత గృహం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అలాగే, పోలీస్‌ల పిల్లల స్కాలర్‌షిప్ కోసం నిధులు కేటాయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజిపి అంజన్‌కుమార్, టిఎస్ఎస్‌పి ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ ఎకె మిశ్రా, అడిషనల్ కమాండెంట్ అభిలాష్ డిష్, పోలీస్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆయు హెల్త్ హాస్పిటల్స్ విస్తరణ

హైదరాబాద్ : హెల్త్ టెక్ స్టార్టప్ అయినా ఆయు హెల్త్ హాస్పిటల్స్ హైదరాబాద్‌లో తొలి సారిగా ప్రవేశించినట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలోని తమ ప్రస్తుత 20 హాస్పిటల్స్, 1500 పడకలకు మరిన్ని హాస్పిటల్స్‌ను జోడించనున్నట్లు తెలిపింది. గురువారం హైదరాబాద్‌లో ఆ సంస్థ కో–ఫౌండర్ హిమేష్ జోషి, సిఒఒ కరణ్ గుప్తా మీడియాతో మాట్లాడుతూ.. ఈ నగరంలో వచ్చే ఏడాది కాలంలో మరో 10–15 హాస్పిటళ్లను జోడించుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుతం తమ సంస్థ ఐదు కీలక నగరాల్లో 130 హాస్పిటళ్లలో కార్యకలాపాలు కలిగి ఉందని.. వచ్చే ఏడాది కాలంలో మరో నాలుగైదు నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విజయవాడపైన దృష్టి పెట్టామన్నారు. రోగులు తమ యాప్ ద్వారా ఆయు హెల్త్ భాగస్వామ్య హాస్పిటళ్లను సందర్శించవచ్చన్నారు. అదే విధంగా కొత్తగా హాస్పిటళ్ల ఏర్పాటు, ఉన్న హాస్పిటళ్లలో నూతన విభాగాల ఏర్పాటులోనూ తాము సహకారం అందిస్తామన్నారు. అదే విధంగా భారీ రాయితీలో ఔషదాలను కల్పిస్తామన్నారు. తమ సంస్థ ఇప్పటి వరకు 32 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించిందన్నారు.



మోడీ గోబ్యాక్

- రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నల్లజెండాలతో ప్రదర్శనలు
- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల వద్ద ధర్నాలు
- కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ప్రకటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో శనివారం మోడీ పర్యటన సందర్భంగా అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నల్ల జెండాలతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు ప్రకటించాయి. గురువారం ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టిఆర్ఎస్‌కెవి రాష్ట్ర అధ్యక్షులు జి రాంబాబు యాదవ్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వియస్ బోస్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి కె సూర్యం, టిఎన్‌టియుసి అధ్యక్షులు ఎంకె బోస్, ఐఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్, ఎఐయుటియుసి రాష్ట్ర నాయకులు బాబూరావు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేషనల్ మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. సింగరేణి యాజమాన్యం కొత్తగా 15 బావుల్లో బొగ్గు వెలికితీతకు కేంద్ర ప్రభుత్వాన్ని అనుమతి అడిగితే ఇవ్వట్లేదనీ, కానీ, అదే సమయంలో బొగ్గుబావులను ప్రయివేటు సంస్థలకు అమ్మకానికి పెట్టిందని తెలిపారు. ఎన్‌టిపిసిలో ప్రయివేటీకరణ చర్యలకు పూనుకుంటోందని విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు తమ హక్కులను కోల్పోయే పరిస్థితి దేశంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, కోట్లాది మంది ప్రజలపై తీవ్ర భారాలు మోపుతున్నదని విమర్శించారు. విద్యుత్ చట్టసవరణ బిల్లు–2022ను 13 రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నా కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే మోడీ సర్కారు మొగ్గుచూపుతున్న తీరును వివరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరి స్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగానే మోడీ గో బ్యాక్ కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ఆర్ఎఫ్‌సిఎల్ వద్ద, సింగరేణి మైన్స్ సంబంధిత జిల్లాలైన ఖమ్మం, కొత్తగూడెం, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో నల్ల జెండాలతో భారీ నిరసనలు తెలపాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల వద్ద ధర్నాలు చేయాలని కోరారు. నిరసన కార్యక్రమాలన్నింటిలోనూ ఉద్యోగులు, కార్మికులు వేలాది పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం మోడీ గోబ్యాక్ నిరసనల్లో పాల్గొంటాం

హైదరాబాద్ సెంట్రల్ పబ్లిక్ కో–ఆర్డినేషన్ కమిటీ

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం శనివారం కేంద్ర, కార్మిక సంఘాలు తలపెట్టిన మోడీ గోబ్యాక్ నిరసనల్లో పాల్గొనబోతున్నట్టు హైదరాబాద్ సెంట్రల్ పబ్లిక్ కో–ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జె రాఘవరావు, బిఇఎల్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సౌందర్ రాజ్, నిరంజన్, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ కాంట్రాక్టు వర్కర్స్ ఫెడరేషన్ కన్వీనర్ బి మధు, బిడిఇయు గౌరవాధ్యక్షులు జె వెంకటేశ్ ప్రకటించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్‌టిపిసిలో 30 శాతం వాటా విక్రయించేందుకు మోడీ సర్కారు పూనుకుందని విమర్శించారు. మైన్స్ యాక్టు రద్దు దారుణమన్నారు. మోడీ ప్రభుత్వం ఓవైపు కార్మికకోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కార్మికులకు, ఉద్యోగులకు చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూనే ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నామని తెలిపారు.

ఇడి హడావిడి...

గ్రానైట్ వ్యాపారంపై కేంద్ర సంస్థలు నజర్
ఇప్పటికైనా నిగ్గుతేల్చాల్సిందేనంటున్న మంత్రి గంగుల
కరీంనగర్‌లో రెండోరోజూ సాగిన జాతీయదర్యాప్తు సంస్థల సోదాలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ వ్యాపార సంస్థలపై ఐటి, ఇడి సంస్థల అకస్మాత్తు దాడులు మళ్లీ సంచలనం రేపిన విషయం తెలిసిందే. అయితే ఈ జాతీయ దర్యాప్తు సంస్థలు ఫిర్యాదులు వచ్చినప్పుడు చేస్తున్న హడావిడిలో ఆ వ్యాపారంపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చడం లేదు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఇప్పటికైనా ఆయా సంస్థలు తమ వ్యాపారంపై వస్తున్న ఆరోపణలను నిగ్గు తేల్చాలని కోరారు. తమకు క్లీన్‌చీట్ వచ్చాక ఫిర్యాదుదారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం గమనార్హం. ఏదేమైనా రెండో రోజు గురువారం సైతం ఆ సంస్థల సోదాలు సాగగా.. ఓ గ్రానైట్ వ్యాపార సంస్థ యజమానిని అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. రాష్ట్రంలో రాజకీయ అలజడి సృష్టించేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇడి, ఐటి దాడులు చేయిస్తోందంటూ మంత్రి గంగులకు పలువురు బాసటగా నిరసనకు దిగడం కొసమెరుపు.

అంతర్జాతీయ మార్కెట్లో కరీంనగర్ జిల్లా నుంచి గ్రానైట్ రాయి వ్యాపారం ఓ స్థాయిలోనే ఉంది. ఇక్కడి నుంచి తీసిన రాయిని కృష్ణపట్నం, చెన్నై, వైజాగ్ పోర్టుల ద్వారా చైనా, ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ సమయంలో పలు వ్యాపార సంస్థలు ఎగుమతి చేసిన బండరాళ్ల పరిమాణాన్ని తక్కువ కొలతలు తీసి అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రధాన ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే 2013లో విజిలెన్స్ అధికారులు చేసిన తనిఖీల్లో కొన్ని గ్రానైట్ వ్యాపార సంస్థలపై రూ.124.94 కోట్ల ఫెనాల్టీగా లెక్కించి ఐదింతల మొత్తం రూ.749 కోట్లు గవర్నమెంట్‌కు చెల్లించాలని చెప్పారు. ఇందులో కొంత మంది కొంతమేర చెల్లించగా చాలా సంస్థలు అసలు అక్రమాలే లేవంటూ కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ నేపథ్యంలో బిజెపికి చెందిన కొందరు నాయకుల ఫిర్యాదుతో రెండేళ్ల కాల వ్యవధిలోనే ఇడి, ఐటి సంస్థలు పలుమార్లు జిల్లాలో సోదాలు నిర్వహించారు. అందులో తేల్చింది ఏదీ బయటకు రాక పోగా.. ఇప్పు డు మళ్లీ సోదాలకు దిగాయి. అదీ తాళాలేసిన ఆఫీసులు, ఇండ్లను తెరిచి మరీ చేస్తున్న సోదాల్లో ఏం తేలుతుందోన్న ఉత్కంఠకు తెరలేపాయి. తాజాగా పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ కుటుంబంతో కలిసి దుబాయ్ టూర్ వెళ్లిన సమయంలోనే ఇడి,ఐటి అధికారులు తాళాలు పగలగొట్టి మరీ సోదాలు చేశారు. ఏకకాలంలోనే హైదరాబాద్, కరీంనగర్ కేంద్రంగా ఉన్న పలు గ్రానైట్ వ్యాపార సంస్థల కార్యాలయాల్లోనూ తనిఖీలు చేపట్టారు. రెండో రోజూ సోదాలు కొనసాగించిన దర్యాప్తు సంస్థలపైనా ఈ చర్యలకు ప్రధాన కారణం కేంద్రంలోని బిజెపి ఆడుతున్న నాటకాలేనంటూ పలువురు ఆందోళనకు దిగారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మనే దహనం చేశారు.


నిరసనలు తెలుపుతున్న మంత్రి గంగుల తదితరులు

రెండో రోజూకొనసాగిన సోదా..

జాతీయ దర్యాప్తు సంస్థల అధికారులు పలు గ్రానైట్ క్వారీల్లో గురువారమూ తనిఖీలు చేపట్టారు. పలు అకౌంట్లకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా బుధవారం ఇడి, ఐటి అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించగా గురువారం మాత్రం ఇడికి చెందిన అధికారులు మాత్రమే ఐదు బృందాలుగా పర్యటించి ఆయా క్వారీల్లో సోదాలు చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లోని ఓ గ్రానైట్ వ్యాపారిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్టు తెలుస్తోంది. గ్రానైట్ యజమానుల సంఘం ప్రతినిధిగా ఉన్న ఆయన్ను విచారించేందుకు తీసుకెళ్లినట్టు సమాచారం.

ఈడీ సోదాలకు నిరసనగా ధర్నా

మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు రాజ్య సభ సభ్యులు రవిచంద్ర ఇళ్లలో ఇడి సోదాలు నిర్వహించడాన్ని నిరసిస్తూ పెద్దపల్లిలో మున్నూరు కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్‌లో రాజీవ్ రహదారిపై బైటాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి భారత్ రాష్ట్ర సమితి (బిఎస్‌పి) ప్రకటించగానే మోడీ, అమిత్‌షాల్లో వణుకు మొదలైందని, కక్ష పూరితంగానే రాష్ట్రంలో ఇడిల పేరుతో కేంద్రంలోని పెద్దలు నాటకాలు ఆడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రధాని మోడీకి తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ నెల 12న రామగుండానికి రాబోతున్న మోడీని అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.

నాపై నిరాధారమైన ఆరోపణలు
బిసి సంక్షేమశాఖమంత్రి గంగుల కమలాకర్

30 ఏళ్లుగా నేను గ్రానైట్ వ్యాపారంలో ఉన్న. ఏనాడూ నేను నిబంధనలు ఉల్లంఘించలేదు. గ్రానైట్ వ్యాపారాన్ని కొందరు మాఫియాలాగా చిత్రీకరిస్తున్నారు. నా వ్యాపారాలపైనా చాలా మంది ఐటీ, ఇడి అధికారులకు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఆయా సంస్థలూ దర్యాప్తు చేశాయి. ఇప్పుడూ విచారణ చేస్తున్నాయి. అందుకు నేను సంపూర్ణంగా సహకరిస్తాను. అందుకే కుటుంబంతో కలిసి దుబాయ్ పర్యటనలో ఉన్న నేను హుటాహుటిన జిల్లాకు చేరుకున్నాను. దర్యాప్తు సంస్థల అధికారులకు అందుబాటులో ఉండి వారికి కావాల్సిన సమాచారాన్ని ఇస్తాను. వారు విచారణకు ఎక్కడికి రావాలని చెప్పినా వెళ్తాను. కొన్నేండ్లుగా ఈ వ్యాపారంపై నిరంతరం వస్తున్న ఆరోపణలను ఇడి నిగ్గు తేల్చాలి. దర్యాప్తులో మాకు క్లీన్ చీట్ వస్తే ఫిర్యాదుదారులపైనా చర్యలు తీసుకోవాలి.

రెండు నెలల్లో కొత్త పార్టీ..!

వ్యాపారంగా మారిన రాజకీయాలు
కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతున్న బిజెపి
విలేకరుల సమావేశంలో మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



దేశంలో, రాష్ట్రంలో రాజకీయం వ్యాపారంగంగా మారిపోయిందని, ఇటీవల జరిగిన మునుగోడు ఎన్నికలు దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయని భూపాలపల్లి మాజీ కలెక్టర్ ఆకునూరి మురళి అన్నారు. ఎమ్మెల్యే స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకు అందినంత దోచుకుంటున్నారని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పేదల అభివృద్ధిని పాతరేసి కార్పొరేట్ కంపెనీలకు ధనాన్ని దోచి పెడుతోందని చెప్పారు. నిస్వార్థపరులైన ఐఎఎస్, ఐపిఎస్, ఇతర సేవా దృక్పథం కలిగిన వారితో మరో రెండు నెలల్లో కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రామవరంలో తన సోదరుడు ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆసక్తికర అంశాలను వెల్లడించారు. రానున్న రోజుల్లో రాజకీయ ప్రక్షాళన జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. నేటి తరం యువతను చైతన్యం చేస్తూ కొత్త రాజకీయ పార్టీ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో సాధించుకున్న తెలంగాణ నేడు నిరుద్యోగ యువతకు ఉపాధి లేకుండా చేసిందని, రాష్ట్రంలో విద్య, వైద్యం, అభివృద్ధిలో శూన్యం కనిపిస్తుందని విమర్శించారు. నరేంద్ర మోడీ, అమిత్ షా కలిసి రూ.పది లక్షల కోట్ల పేదల ప్రజాధనాన్ని బ్యాంకుల నుంచి లూటీ చేసిన వారి రుణాలు మాఫీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మతం పేరుతో దేశంలో కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై ఇడి, సిబిఐ ఇతర వ్యవస్థల ద్వారా దాడులు చేపిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. విద్యను నిర్లక్ష్యం చేసిన ఏ దేశం, ఏ రాష్ట్రం అభివృద్ధి చెందదని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 11.50 శాతం విద్యాభివృద్ధి కోసం బడ్జెట్లో నిధులు కేటాయించారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 6.2 శాతం మాత్రమే నిధులు కేటాయించటం విచరకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పిన కెసిఆర్ రాష్ట్రంలో కార్పొరేట్ వైద్యం, కార్పొరేట్ స్కూల్ విద్యను ఎక్కడ తయారు చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. మునుగోడులో జరిగిన ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా మారాయన్నారు. ఓటుకు వేల రూపాయలు కుమ్మరించి గెలవడం నిజమైన గెలుపు కాదన్నారు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మునుగోడులో ఓట్ల పంపిణీకి రూ.75 కోట్లు ఎవరివి.. ఎక్కడి నుంచి ఖర్చు చేశారో సమాధానం చెప్పాలన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన పానుగంటి పిచ్చయ్య, చేపల ఎర్రయ్య, గుమ్మడి నరసయ్య లాంటి ఎంతోమంది ఆదర్శ ప్రజాప్రతినిధులు ఉన్న ఈ రాష్ట్రంలో ఆదర్శవంతమైన సేవలు అందించేందుకే ప్రజల ముందుకు రానున్నట్టు స్పష్టంచేశారు.